## క్లుప్తంగా

### పైప్‌లైన్ ఏర్పాటుకు పరిశీలన



చేజర్ల : మండలంలోని పంచాయతీలకు పెన్నానది నుంచి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందించే ప్రక్రియపై అధికారులు, ప్రజా ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కృషితో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేజర్లకు రూ.88 లక్షలు, మడపల్లికి రూ.56.88 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్(రూరల్ వాటర్ వర్క్ సప్లై అండ్ శానిటేషన్) డీఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పనులకు సంబంధించి టెండర్లు పూర్తయిందని తెలిపారు. పెన్నాలో పాయింట్లను పరిశీలించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మహేష్, మడపల్లి ఉపసర్పంచ్ పూనూరు మాలకొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు తూమాటి వంశీకృష్ణారెడ్డి, పల్లంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.వెంకటరెడ్డి, ఇ.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పేదల ఆర్థికాభివృద్ధికి కేంద్రం కృషి



రావులకొల్లులో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు, నేతలు

ఆత్మకూరురూరల్ : పేదల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆత్మకూరు బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని రావులకొల్లు, చెర్లోయడవల్లిలో సర్పంచ్‌లు రామిరెడ్డి ఉషారాణి, పిన్నంరెడ్డి ప్రభావతమ్మ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ సేవలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వ్యవసాయాధికారి కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ, వీఆర్వో కృష్ణయ్య, బీజేపీ నేతలు రామసుబ్బయ్య, సుమంత్‌రెడ్డి, కల్యాణ్, స్థానిక నేత రామిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా నగదు అందజేత

చేజర్ల : మండలంలోని పుట్టుపల్లి వాసి గుర్రం చిన్నయ్య సోమవారం ఉదయం పొలాల్లో సేద్యం చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. దీంతో సంబంధిత అధికారులు ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్, సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.

### యానాదిశెట్టి మృతి తీరని లోటు



యానాదిశెట్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంటేరు

జలదంకి : కావలి మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి మృతి నియోజకవర్గ ప్రజలకు తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ సలహా కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. కావలిలోని గ్రంధి నివాసానికి మంగళవారం వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ గ్రంధి యానాదిశెట్టి కావలి పట్టణ ప్రజలకు ఎన్నో సేవలు అందించారని, రాజకీయాలకతీతంగా ప్రజలను ఆదుకున్నారని కొనియాడారు.

### లైసెన్సులు తప్పనిసరి




మాట్లాడుతున్న రాములు

సోమశిల : వాహనాలు నడిపే వారికి లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని ఆత్మకూరు ఆర్టీఓ రాములు పేర్కొన్నారు. అనంతసాగరంలోని వికాస్ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు లైసెన్సులు తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ నరసింహులు, డైరెక్టర్ జిలానీ ఉన్నారు.

# వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పట్టణంలోని 16వ వార్డులో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి, పేదల సంక్షేమం సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి బుక్‌లెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా పేదల ముంగిటకే సేవలందించడంతో పాటు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. జగనన్న కాలనీల పేరుతో భారీ వెంచర్లు, అన్ని వసతులతో లేఅవుట్‌లు ఏర్పాటు చేసి పేదలకు నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా మహిళా సంక్షేమం కోసం వడ్డీలేని రుణాలు, భరోసా, చేయూత, తదితర పథకాలు, నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. పేదల కోసం ఇంత భారీగా పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగనన్న పాలన దేశానికే ఆదర్శం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సచివాలయ పరిధిలో ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న పాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదును జమ చేస్తున్నారన్నారు. గ్రామాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికే పట్టం కట్టాలన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరడంతో మహిళల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయన్నారు. ప్రతి పేదవానికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైద్య ఖర్చులను రూ.5 నుంచి 25 లక్షల వరకు పెంచినట్లు వివరించారు. 2024 ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. ముందుగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.నాగేంద్ర, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ మల్లికార్జున, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, పార్టీ నేతలు ఎం.తిరుపతినాయుడు, డి.చెన్నారాయుడు, ఆర్.మధుసూదన్‌రావు, ఎం.చెన్నకేశవులు, టి.నరసింహారావు, బి.వెంకటరత్నం పి.తిరుపతయ్య, బి.కొండమ్మ పాల్గొన్నారు.

# విజయమే లక్ష్యంగా పనిచేయాలి



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆత్మకూరు నేతలు

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలంలోని మేకపాటి స్వగ్రామమైన బ్రాహ్మణపల్లిలో అల్లంపాడు, ఖాదర్‌పూర్ పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జి.వెంగళరెడ్డి, మాలాలి, రమణారెడ్డి పాల్గొన్నారు.

**రుణపడి ఉంటా**

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా తన నియామకానికి కృషి చేసిన మేకపాటి కుటుంబానికి రుణపడి ఉంటానని ఆండ్రా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని కలిసి సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, యువ నేతలు జె.ప్రణీత్, ఎన్.వినయ్‌కుమార్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, టి.అశోక్, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, జయపాల్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో అల్లంపాడు, ఖాదర్‌పూర్ వైఎస్సార్‌సీపీ నేతలు

**కృతజ్ఞతలు**

చేజర్ల, మడపల్లి గ్రామాలకు పెన్నానది నుంచి తాగునీరు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి చేజర్ల మండల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని కలిసి అభినందించారు. చేజర్ల మండలాధ్యక్షుడు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**అభినందన**

సోమేశ్వరాలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.కోటి నిధులు మంజూరు చేయించడమే కాకుండా తన సొంత నిధులు రూ.50 లక్షలు అందజేసిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి పార్టీ నేతలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతసాగరం వైఎస్సార్‌సీపీ నేతలు బద్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆవాజ్ కమిటీ నివాళి



మర్రిపాడులో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఆవాజ్ నేతలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : స్వతంత్ర సమర యోధులు పండిట్ రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లా ఖాన్ వర్ధంతి కార్యక్రమాన్ని మర్రిపాడు మండల కేంద్రంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశసేవలో రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లా ఖాన్ పోరాట పటిమలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నేతలు రషీద్, రంతుల్లా, గౌస్‌బాషా, రసూల్, కాలేషా, మహబూబ్ దాదా, సీపీఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో నివాళులర్పిస్తున్న ఆవాజ్ సభ్యులు

**ఉదయగిరిలో..**

వరికుంటపాడు (ఉదయగిరి) : పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో విప్లవ పోరాటయోధులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లాఖాన్‌ల వర్ధంతిని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ 1927 డిసెంబర్ 19న పండిత రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫకుల్లాఖాన్‌లను ఆంగ్లేయులు ఉరితీసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాయబ్ రసూల్, బాషా మొద్దీన్, చిన్నఫరీద్, పెద్దఫరీద్, ఎంపీటీసీ కె.విజయమ్మ, రైతుసంఘం నేతలు కె.వెంకటయ్య, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం



లక్ష్మమ్మ కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం అందజేత

అల్లూరు : మిచాంగ్ తుఫాన్ కారణంగా ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నిలం సాయికుమార్ మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని బీరంగుంట అరుంధతీయవాడకు చెందిన కావలి లక్ష్మమ్మకు చెందిన ఇల్లు తుఫాన్ కారణంగా పూర్తిగా దెబ్బతినడంతో ఆమెకు రూ.1,20,000, అల్లూరు కాలువకట్టకు చెందిన ఎ.మస్తానమ్మకు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో ఆమెకు రూ.4 వేలు అందజేశారు. తక్షణమే స్పందించి తమకు సహాయాన్ని అందించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాని వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీటీ సైమన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, వీఆర్వోలు రంతుల్లా, సలాంజీ, పార్టీ నేతలు నిమ్మల భాస్కర్, గరిక నరసింహారావు పాల్గొన్నారు.

## రైతులు జాగ్రత్తగా ఉండాలి



పొలంలో పామును చూపుతున్న రైతు

సోమశిల : ఇటీవల కురిసిన వర్షాలకు వరిపొలాల్లో విష పూరితమైన పాములు సంచరిస్తున్నాయని, దీంతో పొలాల్లో తిరిగేందుకు భయపడుతున్నామని రైతులు తెలిపారు. ఈ విషయమై మండల ఏఓ శ్రీధర్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ ఇటీవలి వర్షాలకు పాములు మిట్ట ప్రదేశాలకు వస్తుంటాయని, వాటి ఆవాసాల్లో నీరు తగ్గాక తిరిగి వెళ్లిపోతాయని తెలిపారు. రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వేళ్లలో టార్చ్‌లైట్ల ముందు శబ్దం చేసుకుంటూ తిరగాలని సూచించారు.

## వివాహిత అదృశ్యం

• పోలీసులకు ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలోని ఆరవేడు గ్రామానికి చెందిన వివాహిత మౌనిక కనిపించడం లేదని భర్త పద్మనాభరెడ్డి ఆత్మకూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం పొలానికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిందని, అయితే సాయంత్రం ఇంటికి వెళ్లి చూస్తే ఇద్దరు పిల్లలు, ఆమె కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారణ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భర్త తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు.

# నిర్ణయించిన మేరకు సాగునీటి సరఫరా



రామస్వామిపల్లి సమీపంలో ఉత్తరకాలువ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న సోమశిల అధికారులు

ఆత్మకూరురూరల్ : ఐఏబీ సమావేశంలో నిర్ణయించిన మేరకు కలెక్టర్ ఆదేశాలతో సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు నీటి విడుదల చేస్తామని, అందుకు అనుగుణంగా రైతులు పంటల సాగు చేసుకోవాలని సోమశిల జలాశయం నాలుగో డివిజన్ డీఈ మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్తరకాలువ పరిధిలోని రామస్వామిపల్లి సమీపంలో రెగ్యులేటర్ వద్ద సోమశిల ప్రాజెక్ట్ ఏఈలు పరమేశ్వరరెడ్డి, కొండారెడ్డిలతో కలిసి ఆయన మంగళవారం మాట్లాడారు. ఐఏబీ తీర్మానం ప్రకారం మురగళ్ల కాలువ సమీపంలోని 24ఆర్ రెగ్యులేటర్ వరకు 22 వేల ఎకరాల ఆయకట్టుకు రెండు టీఎంసీల నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపుగా నియోజకవర్గంలోని అన్ని చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో ఉత్తర కాలువ ఆయకట్టు చెరువులతో పాటు రాళ్లపాడు రిజర్వాయర్‌కు తాగునీటి కోసం ఒక టీఎంసీ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మార్చి మొదటి వారంలో 64వ కిలోమీటరు రెగ్యులేటర్ నుంచి వందో కిలోమీటరు వరకు సోమశిల నుంచి నీరు విడుదల చేస్తామన్నారు. ఉత్తర కాలువలో ప్రవహించే నీటిని ప్రామాణికంగా తీసుకొని మండలంలోని మహిమలూరు, కరటంపాడు, బసవరాజుపాళెం, మర్రిపాడు మండలం డీసీపల్లి చెరువు ఆయకట్టు రైతులు వరిసాగు చేపట్టాలని సూచించారు. ఎవరైనా అక్రమ పద్ధతుల్లో నీటిని వినియోగించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎన్నికల మార్గదర్శకాలను పాటించాలి



మాట్లాడుతున్న ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

వరికుంటపాడు (ఉదయగిరి) : నియోజకవర్గంలో పనిచేసే ఏఈఆర్వోలు, బీఎల్వోలు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికలాధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బంది, రాజకీయ నేతలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. బీఎల్వోలు, ఏఈఆర్వోలు ఫారం 6, 7, 8లపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలన్నారు. దివ్యాంగుల ఓటర్లను గుర్తించాలన్నారు. 19 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ తగిన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఓటు నమోదు చేయాలన్నారు. ఓటర్ల తాజా జాబితా తయారీకి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి తొలగించాలన్నారు. బీఎల్వోలు, ఏఈఆర్వోలు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఎన్నికల డీటీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందితో నిర్వహణ

• తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



చేజర్ల ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులు

చేజర్ల : అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో సచివాలయ సిబ్బందిచే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కరిముల్లా మంగళవారం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని సుమారు 50 అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచామన్నారు. ప్రతి కేంద్రంలో సచివాలయ సిబ్బంది ఉంటారని, ఇక్కడి పిల్లలకు సమీప ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## యువజన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నోటి



వినయ్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరు : వైఎస్సార్‌సీపీ కేంద్ర కమిటీ మంగళవారం విడుదల చేసిన జిల్లా యువజన విభాగ కమిటీలో ఆత్మకూరుకు చెందిన నోటి వినయ్‌కుమార్‌రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. అదే క్రమంలో నియోజకవర్గానికి చెందిన కొమ్మూరి ప్రతాప్, షేక్.మహమ్మద్ రఫీలను కార్యదర్శులుగా, పార్లపల్లి కృష్ణతేజ, కాకుమూరి వెంకటరెడ్డిలను సహాయ కార్యదర్శులుగా ఎంపిక చేస్తూ తాడేపల్లి నుంచి జిల్లా పార్టీ కార్యాలయానికి ఆదేశాలు అందాయి.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ పొడిగింపు

నెల్లూరు (లీగల్): జీఓ నంబర్ 512ను రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేపట్టిన కోర్టు విధుల బహిష్కరణను ఈ నెల 22 వరకు పొడిగిస్తున్నామని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ మాట్లాడారు. మెజార్టీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు క్రిమినల్ కేసుల బెయిళ్లు, సివిల్ కేసుల అవుట్ ఆఫ్ ఆర్డర్లకు మినహాయింపునిచ్చామని చెప్పారు.

# పేదల ఆరోగ్యానికి అభయం ఆరోగ్యశ్రీ



సోమశిల : ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ



జలదంకి సచివాలయంలో కార్డులను అందజేస్తున్న నేతలు

సోమశిల : ఆరోగ్యశ్రీ పథకం పేదల ఆరోగ్యానికి అభయం అని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ఆమె ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు పెంచారని తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుని ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబర్ తదితర వివరాలు పొందుపరిచి ఉంటాయన్నారు. గ్రామ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు లబ్ధిదారులతో ఈకేవైసీ చేయించాలన్నారు. అనంతసాగరం సచివాలయం పరిధిలో 700 పైగా ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మండల కో–ఆర్డినేటర్ అంకిరెడ్డి, ఎంపీడీఓ ఎ.మధుసూదన్‌రావు, వైస్ ఎంపీపీ పాణెం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు బద్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ బద్రెడ్డి నాగేంద్రరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు శ్రావణి, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

**రూ.25 లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు**

జలదంకి : ఆరోగ్యశ్రీ పరిమితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచారని వైఎస్సార్‌సీపీ నేత ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జలదంకి సచివాలయంలో ఆరోగ్యశ్రీ కార్డులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బత్తిన సింగయ్య మాట్లాడుతూ వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కార్డుల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ మండల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.